క్లుప్తంగా

రూ.2.73 లక్షలకు వేలం పాట ఖరారు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రోడ్ మార్జిన్ ఆశీళ్ల వసూలు వేలం పాట రూ 2,72,978లకు ఖరారైంది. నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వేలం పాటలో సలాది కాత్యాయని ఒక్కరే పాల్గొని వేలంను దక్కించుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఆశీళ్ల వసూలుకు అవకాశం ఉంటుందని కమిషనర్ పి.బాలాజీప్రసాద్ తెలిపారు. మేనేజరు టివిఎస్.విశ్వేశ్వరరావు, ఆర్ఐ త్రినాథ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: స్థానిక మిమ్స్ సమీపంలోనున్న కేజీబీవీ బాలికల పాఠశాలలో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8 తరగతులతో పాటు ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూపులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన బాలికల నుంచి ఈ నెల 27వ తేదీ నుంచి ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కేవలం ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే ప్రవేశాలకు అవకాశం ఉందన్నారు. 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు డ్రాపౌట్స్, బడి బయట బాలికలు, అనాథలైన బాలికలకు ప్రాధాన్యత ఇస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు పాఠశాలలోని కార్యాలయాన్ని పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఆటోలపై ప్రత్యేక డ్రైవ్

విజయనగరం క్రైమ్ : పట్టణంలో ఆటోలకు సంబంధించి మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు, డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పట్టు కూడళ్లలో తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లో స్పీకర్లు ఏర్పాటు చేసి, శబ్ద కాలుష్యం చేస్తూ ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని తొలగించారు. ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. లౌడ్ స్పీకర్లు పెట్టి ఇతర వాహనాలకు, ప్రయాణికులకు ఇబ్బందులు సృష్టించడం సరికాదని అన్నారు. నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలకు చెక్ పెట్టొచ్చన్నారు.

పూడికల తొలగింపు



పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ ప్రసాద్

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని 7వ వార్డులో స్థానిక కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ తన సొంత నిధులతో మురుగునీటి కాలువల్లోని పూడికలను తొలగించే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. స్థానిక ప్రధాన వీధిలోని కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో మురుగునీరు దిగువకు ప్రవహించని పరిస్థితి ఇక్కడ నెలకొంది. ప్రజల అభ్యర్థన మేరకు స్పందించిన కౌన్సిలర్ ప్రసాద్ జేసీబీతో కాలువల్లోని పూడికలను తొలగించే ఏర్పాటు చేశారు. తద్వారా పారిశుద్ధ్య కార్మికుల సహకారంతో సమస్యను పరిష్కరించారు. కౌన్సిలర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం



సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామానికి చెందిన అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మైలిపిల్లి నరసింహులు, వాసుపల్లి రేయుడు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. గుంటు గరగమ్మ బాధిత కుటుంబానికి 25 కేజీల రెండు బియ్యం ప్యాకెట్లు, నిత్యావసర సరుకులతో పాటు రూ.5వేలు నగదు అందజేశారు.

పందులతో ఇబ్బందులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఫూల్‌బాగ్ కాలనీలోని 4వ వార్డు పరిధిలోని మంగళవీధి కాలనీలో పందులు బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ పందులు చనిపోవటంతో దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. అలాగే వీటి సంచారంతో కాలువ పరిసరాల్లో పారిశుద్ధ్యం లోపిస్తుందని వారు పేర్కొంటున్నారు. దీని వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మెదడు వాపు వంటి ప్రమాదకర వ్యాధులు పందుల వచ్చే అవకాశం ఉండడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పందులు నివారణకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సుందరంగా.. విజయనగరం

- నగరంలో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు
- రూ.25 నుంచి రూ.30 లక్షలతో ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్ అభివృద్ధికి చర్యలు
- దేశ రాజధాని ఢిల్లీ తరహాలో... జిల్లా కేంద్రంలో ఏర్పాటు
- 11 మంది మహనీయుల విగ్రహాలతో సుందరంగా రూపుదిద్దుకుంటున్న జంక్షన్
- ఏప్రిల్ 6న దండి మార్చ్ రోజున ప్రారంభించేందుకు సన్నాహాలు



నగరంలోని ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్‌లో ఏర్పాటు చేస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు

విజయనగరం: కళలకు కాణాచి.. విద్యలకు నిలయం... సాంస్కృతిక రాజధానిగా విరాజిల్లుతోన్న విజయనగరం అభివృద్ధి పథంలో రోజుకో నూతన రూపాన్ని సంతరించుకుంటోంది. కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరంలో ఇతర నగరాలకు దీటుగా అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రధాన జంక్షన్‌ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన కార్పొరేషన్ పాలకులు ఒక్కొక్కటిగా జంక్షన్‌లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌లో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు నగరంలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. సుమారు రూ.25 నుంచి రూ.30 లక్షల ఖర్చుతో దేశ రాజధాని ఢిల్లీ తరహాలో విజయనగరం జిల్లా కేంద్రంలో దేశ స్వాతంత్ర్య సాధనలో కీలకపాత్ర పోషించిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. స్వాతంత్ర్య సమరంలో కీలకమైన ఉప్పు సత్యాగ్రహంలో జాతిపిత మహాత్మాగాంధీ వెన్నంటే నిలిచిన మొత్తం 11 మంది విగ్రహాలు నగరానికి చేరుకోగా... వాటిని అమర్చే పనులు జరుగుతున్నాయి. ఇందులో విగ్రహాల కోసం రూ.20 లక్షల వరకు వెచ్చించగా, మరో రూ.5 నుంచి రూ.10 లక్షల ఖర్చుతో జంక్షన్ మధ్యలో గ్రానైట్ పలకలతో చిన్నపాటి వేదిక నిర్మించి ఆ చుట్టూ స్టీల్ రైలింగ్ ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా మహనీయుల విగ్రహల చుట్టూ వాటర్ ఫౌంటైన్‌తో రాత్రి వేళల్లో ఆకర్షణీయంగా కనిపించేలా విద్యుత్ దీపాలను అలంకరించనున్నారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఏప్రిల్ 6న జరిగే ఉప్పు సత్యాగ్రహం (దండి మార్చ్) రోజున రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు తెలిపారు. ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేస్తామన్నారు. దేశ రాజధాని ఢిల్లీ తరహాలో విజయనగరం జిల్లా కేంద్రంలో ఇటువంటి విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఒక్క రోజులో రూ.1.60 కోట్ల పన్ను వసూలు



పన్నులు చెల్లించని ఇళ్లకు రెడ్ నోటీసులు అతికిస్తున్న మున్సిపల్ సిబ్బంది

విజయనగరం: ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడుతున్న తరుణంలో కార్పొరేషన్ యంత్రాంగం పన్నుల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేసింది. మరో 3 రోజులు మాత్రమే గడువు ఉండటంతో బకాయిలున్న భవన యజమానుల వద్దకు నేరుగా వెళ్లి పన్నులు వసూళ్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం బకాయి పన్నుల మొత్తంపై వడ్డీ మాఫీని ప్రకటించటంతో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం ఒక్క రోజే 845 అసెస్మెంట్‌ల నుంచి రూ.1.60 కోట్లు మొత్తాన్ని వసూలు చేసినట్లు అధికారులు పేర్కొనగా... ఇప్పటికీ పన్ను బకాయిలు చెల్లించని వారి ఇళ్లకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 67,416 అసెస్‌మెంట్‌లు ఉండగా... వాటి నుంచి పాత కొత్త బకాయిలు మొత్తం కలిపి రూ.45.77 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అందులో ఇప్పటి వరకు రూ.31 కోట్లు వసూలు చేసినట్లు కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు తెలిపారు.

విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం



నూతన తరగతి గదుల సముదాయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని, ఈ ప్రక్రియలో రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరిన్ని సంస్థలు ఆదర్శంగా తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. అయ్యన్నపేటలో రౌండ్ టేబుల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో నిర్మించిన 4 నూతన తరగతి గదుల సముదాయాన్ని కోలగట్ల మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ వ్యాపారవేత్తలంతా కలిసి రౌండ్ టేబుల్ సంస్థ ద్వారా పలు ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. రౌండ్ టేబుల్ సంస్థ ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో ఈ పాఠశాల భవనాన్ని నిర్మించడమే కాకుండా విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో బెంచీలు కూడా ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. రౌండ్ టేబుల్ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే నగరంలోని కొత్తపేట జంక్షన్ వద్ద గోకుల్ పార్క్‌ను ఏర్పాటు చేయటంతో పాటు 11వ వార్డులో ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీదేవి, కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు, విజయనగరం కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్, కార్పొరేటర్లు పిన్నింటి కళావతి, రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీటీసీలో సిమెంట్ బల్లలు ఏర్పాటు



పీటీసీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలపై ఆశీనులైన స్థానికులు

విజయనగరం క్రైమ్: విజయనగరం పీటీసీ పరేడ్‌లో రోటరీ క్లబ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 10 సిమెంటు బల్లలను పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ రోటరీ క్లబ్ గవర్నర్ ఎ.కె.ఎస్.వి.భాస్కర్ రామ్‌కి, క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సిమెంట్ బళ్లలు పీటీసీకి వచ్చిన శిక్షణార్థులకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ తిరుమల ప్రసాదరావు, క్లబ్ ప్రెసిడెంట్ ఉమాబాలాజీ, క్లబ్ కార్యదర్శి ఎం.బి.బి.ఎస్.ఎస్. సూర్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పి.వి.అప్పారావు, ఆర్ఐలు పి.కోటేశ్వరరావు, డి.శంకరరావు, ఎం.మురళీధరరావు, ఆర్ఎస్ఐలు మురళీధర్, సంతోష్, ధర్మారావు, రమణ, వెంకట రమణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎంపీ సభ్యుల డిక్లరేషన్ ఫారం ఆవిష్కరణ



డిక్లరేషన్ ఫారాలు చూపుతున్న ఆర్ఎంపీలు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పీఎస్ఆర్ కాంప్లెక్స్ ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం కార్యాలయంలో మెంబర్స్ స్టేటస్ డిక్లరేషన్ ఫారంను రాష్ట్ర ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కంబాల బాబురావు మంగళవారం ఆవిష్కరించారు. అనుభవ వైద్యుల సంఘాల సమైక్య రూపొందించిన ఎంఎస్‌డీఎఫ్ ఫారంను జిల్లాలో ఉన్న ఆర్ఎంపీలు రాష్ట్ర సంఘంలో నమోదు కావాలని బాబురావు కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఎంత మంది సభ్యులు ఉన్నారని ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు జంగంజోషి, జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి, జిల్లా కార్యదర్శి కోట్ల పైడిరాజు, ఉపాధ్యక్షులు రామ్మూర్తి రాజు, ముత్యాలరావు, కోశాధికారి ఉమాశంకర్, త్రినాధ చౌదరి, శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

విజయనగరం ఫూల్‌బాగ్: ఆటో, రవాణా కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు రెడ్డి శంకర్రావు పిలుపునిచ్చారు. స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5న తలపెట్టిన పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

విజయనగరం అర్బన్: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత కాలమానిని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ తెలుగు నెలతో కూడిన క్యాలెండర్ చైత్ర మాసంతో ప్రారంభమై ప్రతి పేజీలోనూ జ్ఞాన వాక్యాలను తెలిపే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రబోధసేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక జిల్లా శాఖ సభ్యులు శంకరరావు, సీవీఎస్‌నాయుడు, వంశీ, రాజప్పుడు, రాము, రమణ, తరుణ్, దుర్గారావు, ఉపేంద్ర పాల్గొన్నారు.

యువతతోనే అభివృద్ధి : డీఈఓ

నెల్లిమర్ల: యువతతోనే దేశ, సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన లీడ్ ఇండియా – 2020 శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. డైట్ విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో దూసుకుపోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుపతినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నెల్లిమర్ల: నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ బంగారు సరోజిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి 20 వార్డులకు చెందిన కౌన్సిలర్లతో పాటు అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని సూచించారు. అధికారులంతా సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

మధురమే సుధాగానం



మాట్లాడుతున్న కళాపీఠం వ్యవస్థాపకుడు నారాయణ

విజయనగరం టౌన్: మధురమే.. సుధాగానం పేరుతో ఏప్రిల్ ఒకటో తేదీన సాయంత్రం 4 గంటల నుంచి ఆనందగజపతి ఆడిటోరియంలో గురునారాయణ కళాపీఠం వార్షికోత్సవం జరగనుందని కళాపీఠం వ్యవస్థాపకులు బి.ఎ.నారాయణ తెలిపారు. స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్షికోత్సవంలో 40 మందికి పైగా గాయనీ, గాయకులు తమ గానంతో అలరిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు హాజరవుతారని, చలన చిత్ర సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌ను ఘనంగా సత్కరిస్తామని చెప్పారు. గాయని సురభి శ్రావణికి ఆత్మీయ సత్కారం ఉంటుందన్నారు. అదేవిధంగా గాయనీ, గాయకులు పవన్‌చరణ్, సంతోష్‌కిరణ్, హారికా శివరామ్, బేబీ లావణ్యలతిక, మాస్టర్ శేఖరచరిత్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారన్నారు. వెండితెర, బుల్లితెర నటీమణి, ఆత్మీయగాయని పడాల కల్యాణి కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ కార్యదర్శి నడిపేన శ్రీనివాసరావు, అధ్యక్షుడు డాక్టర్ జి.సన్యాసమ్మ, కోశాధికారి బి.పద్మావతి పాల్గొన్నారు.

రక్తదాతలకు అభినందనలు



రక్తదాతలను అభినందిస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం: నేటి తరం యువత సామాజిక కార్యక్రమాల్లో భాగంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి పిలుపునిచ్చారు. సీతం ఇంజినీరింగ్ కళాశాలలో విజయదుర్గా యూత్ సొసైటీ, సీతం ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో కేశవపట్నం దుర్గారావు 67వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆమె పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో 40 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయగా వారిని ఝాన్సీ లక్ష్మి అభినందించారు. మనం చేసే రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడుతుందన్నారు. కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, విజయదుర్గ యూత్ సొసైటీ అధ్యక్షులు చంద్రిక, విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామాష్, రాయల్ క్యాబ్స్ శరత్, సభ్యులు జయలక్ష్మి, నవత, జ్యోతి హిమశ్రీ, షణ్ముఖ, మమ్ముల తిరుపతిరావు, కల్యాణి, పూర్ణ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

విస్తృత సామాజిక కార్యక్రమాలకు కార్యాచరణ

- రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ భాస్కరరామ్



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ భాస్కరరామ్

విజయనగరం: సామాజిక సంక్షేమ కార్యక్రమాలను విస్తృతగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.భాస్కరరామ్ పేర్కొన్నారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోటరీ అక్షరాస్యత, మహిళల ఉపాధి, గ్రామీణ పట్టణ ప్రాంతాల వారికి విద్య, వైద్య సదుపాయాల కల్పన, రక్షిత తాగునీరు అందించడం లక్ష్యంగా పని చేస్తుందన్నారు. విద్యాభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా గత ఐదేళ్లగా విజయనగరం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ బెంచీలను సమకూర్చామన్నారు. పోలియో నివారణకు ఖర్చు చేస్తున్నామన్నారు. తాగునీటి కల్పన కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో విజయనగరం జిల్లాలో సుమారు 80 లక్షల రూపాయలతో మినీ రక్షిత నీటి పథకాలను ఏర్పాటు చేశామన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మినీ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్యం కోసం చేస్తున్న కృషిలో భాగంగా జిల్లా కేంద్రమైన విజయనగరం పట్టణంలో రోటరీ రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సమావేశంలో రోటరీ అధ్యక్షురాలు ఉమా బాలాజీ, కార్యదర్శి సూర్యలక్ష్మి, సహాయ గవర్నర్ డాక్టర్ తిరుమల ప్రసాద్, జి.వినోద్, డాక్టర్ బి.రాధికరాణి, డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ ఎస్తేరురాణి

పూసపాటిరేగ: గర్భిణులు పోషక విలువలుతో కూడిన ఆహారం తీసుకోవాలని భోగాపురం సెక్టార్ ఐసీడీఎస్ పీఓ ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని కొప్పెర్లలో కోనాడ సెక్టార్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి ఐసీడీఎస్ కార్యకర్తలు తీసుకువచ్చిన పౌష్టికాహారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీగా వున్నప్పుడు పౌష్టికాహారం తీసుకోకపోతే రక్తహీనతతో వున్న పిల్లలు జన్మిస్తారన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఐసీడీఎస్ కార్యకర్తలు ఇచ్చిన సూచనలు, సలహాలు పాటించాలని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, సిబ్బంది చిన్నమ్మలు, శకుంతల, అనిత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు



కండక్టర్లకు ఫస్ట్ ఎయిడ్ కిట్ల అందజేత

విజయనగరం: విజయనగరం వి డెంటల్ ఆస్పత్రి సౌజన్యంతో ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేశారు. విజయనగరం ఆర్‌టీసీ బస్సు డిపోలో డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు సమక్షంలో 200 ఫస్ట్ ఎయిడ్ కిట్లను కండక్టరులకు మంగళవారం అందజేశారు. ఆర్ఎంపీ వైద్యుల రాష్ట్ర ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ కంబాల బాబూరావు, ఆర్‌టీసీ డిప్యూటీ సీఎం ఈసీహెచ్ అప్పల నారాయణరావు, డిపో మేనేజర్ ఎ.శ్రీనివాసరావు, డా.ప్రవీణ్ కుమార్, వి డెంటల్ ఆస్పత్రి డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్యవసర సమయంలో ప్రయాణికులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని డీపీటీఓ కె.శ్రీనివాసరావు అన్నారు. ఈ కిట్లను అందజేసిన వి డెంటల్ ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గడప గడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాలపై మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగరపాలక సంస్థ మేయర్ విజయలక్ష్మి

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 20వ డివిజన్ శాంతినగర్ ప్రాంతంలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. స్థానికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ముస్లింలు తమ సాంప్రదాయ రీతిలో సత్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల పట్ల అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్, ఆసరా, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన వంటి సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళుతుంటే ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తవిటిరాజు, డిప్యూటీ మేయర్ రేవతిదేవి, 21వ డివిజన్ కార్పొరేటర్ కనకల నాగవల్లి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూరిబాబు, కనకల గిరి తదితరులు పాల్గొన్నారు.

'అవనాపు'ను సన్మానించిన డీసీఎంఎస్ డైరెక్టర్లు



విక్రమ్‌ను సన్మానిస్తున్న డీసీఎంఎస్ డైరెక్టర్లు

విజయనగరం ఫోర్ట్: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమించబడ్డ అవనాపు విక్రమ్‌ను డీసీఎంఎస్ కార్యాలయంలో డీసీఎంఎస్ డైరెక్టర్లు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లప్పుడు పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుచుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వెంకట చినరామునాయుడు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన తదితరులు పాల్గొన్నారు.